ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 26 సెప్టెంబరు 2025



సరస్వతి స్వరూపుడిగా భక్తులకు కటాక్షం

● రెండున్నర గంటల పాటు సాగిన వాహన సేవ

తిరుమల, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మలయప్పస్వామి వీణ ధరించి సరస్వతీదేవి అలంకారంలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఎండతీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం జరిగిన చిన్నశేషవాహనంలో భక్తుల రద్దీ తక్కువగానే ఉంది. గ్యాలరీలన్నీ ఖాళీగా కనిపించాయి. సాయంత్రానికి వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్న క్రమంలో రాత్రి హంస వాహన సమయంలో దక్షిణ మాడవీధి మినహా మిగిలిన గ్యాలరీలన్నీ భక్తులతో నిండిపోయాయి. దీంతో వాహనాన్ని నెమ్మదిగా కదిలిస్తూ గ్యాలరీల్లోని భక్తులకు సంతృప్తికరమైన దర్శనాన్ని కల్పించారు. దీనివల్ల అరగంట ఆలస్యంగా.. రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు వాహన సేవ సాగింది. వీఐపీలు తిరుగు ప్రయాణమైన క్రమంలో ట్రాఫిక్ ఆంక్షలను సడలించారు. రాత్రి వాహన సేవ ముందు వీఐపీల హడావుడి ఎక్కువ కాగా.. దీనిని తగ్గించాలంటూ భద్రతాధికారులను ఈవో సింఘాల్ ఆదేశించారు. ఈ వాహన సేవలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, నటి వాసుకీ, చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉదయం: చిన్నశేష వాహనంపై గురువాయూరు శ్రీకృష్ణుడి అలంకారంలో మలయప్ప కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. ఏనుగులు, అశ్వాలు ముందు కదులుతుండగా భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనల నడుమ వాహనసేవలు వైభవంగా జరిగాయి.



బ్రహ్మోత్సవాలలో నేడు | ఉదయం: 8-10 మధ్య సింహవాహనం | రాత్రి: 7-9 మధ్య ముత్యపుపందిరి వాహనం

గంటపాటు ఆలయంలో ఉపరాష్ట్రపతి, సీఎం



శ్రీవారి ఆలయంలో ఉప రాష్ట్రపతికి చిత్రపటం బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్, ఈవో

తిరుమల, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం గంటపాటు తిరుమల ఆలయంలో గడిపారు. ఉదయం 8.35 గంటలకు మహద్వారం నుంచి ఆలయప్రవేశం చేశారు. గర్భాలయంలోని శ్రీవారిని దర్శించుకుని 9 గంటలకు రంగనాయక మండపానికి చేరుకున్నారు. వేదపండితలు ఆశీర్వచనం తర్వాత 9.25 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చారు. బయట వాహనాల వద్దకు వెళుతూ గ్యాలరీల్లోని భక్తులకు అభివాదం చేశారు. సమీపంలో ఉన్న కొందరు పిల్లలను సీఎం ఆప్యాయంగా పలకరించారు. వీరిద్దరు ఆలయం వెలుపలకు వచ్చే క్రమంలో కొద్ది సమయంలో అన్నదానం సమీపంలో వాహనాన్ని ఆపడంతో పాటు అక్కడక్కడ గేట్లు వేశారు. దీన్ని గమనించిన సీఎం వెంటనే గేట్లు తెరవాలని ఆదేశాలిచ్చారు. దీంతో వాహనసేవ యదావిధిగా ముందుకు సాగింది.



వాహనం వచ్చే క్రమంలో వేసిన గేట్లను తెరవాలని ఆదేశిస్తున్న సీఎం చంద్రబాబు - ప్రముఖులు రాకముందు నిర్మానుష్యంగా ఉన్న ఆలయ ప్రాంతం

వీవీఐపీల సందడి



ఉన్నతాధికారులు లేకుండా సాగుతున్న చిన్నశేషవాహనం

బ్రహ్మోత్సవాల ప్రారంభం సమయంలో తిరుమల మొత్తం వీవీఐపీలతో హడావుడిగా కనిపించింది. పట్టువస్త్రాలు సమర్పించడానికి వచ్చిన సీఎంతో పాటు ఉపరాష్ట్రపతి, మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఉండడంతో తిరుమల క్షేత్రం సైరన్లమోతతో మారుమోగింది. వీవీఐపీలు వెంట ఉన్నాతాధికారులు అంతా ఉండాల్సిరావడంతో గురువారం ఉదయం జరిగిన చిన్నశేషవాహన సేవలో చాలా మంది ఉన్నతాధికారులు పాల్గొనలేకపోయారు. ప్రారంభం, ముగింపులో మాత్రమే ఉన్నతాధికారులు కనిపించారు. వీఐపీల వల్ల అక్కడక్కడ గేట్లకు తాళాలు వేయడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. విధులకు వెళ్లాల్సిన ఉద్యోగులు కూడా ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ప్రధానంగా రాంభగీచా, మినీషాపింగ్ కాంప్లెక్స్ వంటి ప్రాంతాల్లో ఈ సమస్యలు కనిపించాయి.

'అన్నా' ఇంట విషాదం

● చిలకలూరిపేట వద్ద ప్రమాదంలో అల్లుడు, మనవరాలి దుర్మరణం
● మరో ఐదుగురికి గాయాలు ● కార్పొరేటర్ అన్నా సంధ్య పరిస్థితి ఆందోళనకరం



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బీసీ నేత అన్నా రామచంద్రయ్య ఇంట విషాదం నెలకొంది. గుంటూరులో జరిగే బంధువుల ఫంక్షన్‌కు వెళ్తుండగా బుధవారం అర్ధరాత్రి 10.30 గంటలకు వీరి కారుకు చిలకలూరిపేట వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రామచంద్రయ్య అల్లుడు డాక్టర్ వెంకటకిషోర్(42), మనవరాలు అశ్వీనందన (4) మృతిచెందగా, మిగిలిన ఐదుగురు గాయపడ్డారు. వీరిలో కార్పొరేటర్ అన్నా సంధ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరుకు చెందిన తంగెళ్ల వెంకటకిషోర్ స్విమ్స్‌లో జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. ఈయన అన్నా రామచంద్రయ్య పెద్ద కుమార్తె డాక్టర్ అన్నా సంధ్యను వివాహం చేసుకున్నారు. ఈమె కార్పొరేటర్. రేణిగుంట విమానాశ్రయ సమీపంలోని బాలాజీ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్. వీరికి కుమారుడు ఆయుష్ నందన, కుమార్తె అశ్వీనందన ఉన్నారు. గుంటూరులో ఫంక్షన్ కోసం ఈ నలుగురితో పాటు అన్నా రామచంద్రయ్య కోడలు డాక్టర్ శ్వేత, ఆమె కుమార్తెలు అన్నా ఆధ్య(8), అన్నా మైరా కలిసి బుధవారం రాత్రి పది గంటల ప్రాంతంలో మహేంద్ర ఎక్స్ యూవి 700 కారులో బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున 2.15 గంటల ప్రాంతంలో మార్టూరు చిలకలూరిపేట మధ్య తాతపూడి ఫ్లై ఓవర్ వద్ద వీరి కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వెంకటకిషోర్ కారు నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. తలపై బలమైన గాయాలైన చిన్నారి అశ్వీనందనను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. కారు ముందు సీట్లో ఉన్న కార్పొరేటర్ అన్నా సంధ్య కాళ్లకు తీవ్ర గాయాలవడంతో గుంటూరులోని రమేష్ ఆస్పత్రికి తరలించినట్లు చిలకలూరిపేట ఎస్‌ఐ అనిల్‌కుమార్ చెప్పారు. మిగిలిన నలుగురికి చిలకలూరిపేటలోని ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి రేపల్లెలోని వెంకటకిషోర్ ఇంటికి తరలించారు. అక్కడే దహన సంస్కారాలు నిర్వహించనున్నారు. అతి వేగంతో పాటు నిద్రమత్తు వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో 'అన్నా' ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. అన్నా రామచంద్రయ్య ఆయన కుటుంబ సభ్యులు చిలకలూరిపేటకు వెళ్లారు. ఇక, చిలకలూరిపేటలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన వారు ఆయన బంధువులని సమాచారం. కాగా, వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి కూడా తిరుపతి నుంచి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించారు.



డాక్టర్ వెంకటకిషోర్ (ఫైల్ ఫొటో)



మృతి చెందిన అశ్వీనందన

నాన్నంటే ప్రేమ: నాలుగేళ్ల అశ్వినందనకు నాన్న వెంకట కిషోర్ అంటే విపరీతమైన ప్రేమ అని కుటుంబీకులు చెబుతున్నారు. అతడిని వదిలి ఉండేది కాదని.. మృత్యువులోనూ ఆయన వెంటే వెళ్లిందంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రూ.5 లక్షల టపాకాయలు సీజ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని శివకాశి నుంచి కొరియర్ ద్వారా అక్రమంగా తెప్పించిన రూ.5 లక్షల టపాకాయలను గురువారం తిరుపతి ఈస్ట్, అలిపిరి పోలీసులు సీజ్ చేశారు. జీఎస్టీ చెల్లించకుండా రెండు నెలలుగా కొరమేనుగుంటలోని మిట్టూరు ట్రాన్స్‌పోర్టు ద్వారా 27 బాక్సులు తెప్పించారని అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపారు. గురువారం తిరుపతి డీఎస్పీ భక్తవత్సలంకు అందిన సమాచారం మేరకు ఈస్ట్, అలిపిరి సీఐలు శ్రీనివాసులు, రాంకిషోర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది దాడి చేసి సీజ్ చేశారు. అనుమతుల్లేకుండా.. భద్రతా ప్రమాణాలు పాటించకుండా టపాకాయలు నిల్వ ఉంచిన ఆ రవాణా కంపెనీపై కేసు నమోదు చేశారు.



వీఎస్వోలూ వెల్‌డన్

ప్రపంచ పోలీస్ గేమ్స్‌లో ప్రతిభ చాటిన టీటీడీ విజిలెన్స్ వీఎస్వోలను సీఎం చంద్రబాబు అభినందించారు. బర్మింగ్‌హామ్‌లో ఇటీవల జరిగిన ప్రపంచ పోలీస్, ఫైర్ గేమ్స్-2025లో వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర స్వర్ణ, కాంస్య పతకాలను సాధించారు. వీరు గురువారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి తమ విజయాన్ని వివరించారు. వీరిద్దరినీ చంద్రబాబు అభినందిస్తూ పట్టువస్త్రంతో సత్కరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రాంకిషోర్, సురేంద్రను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

ఆనందోత్సాహాలు

1529మంది టీచర్లకు నియామక పత్రాలు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన 1529మంది టీచర్లు గురువారం నియామక పత్రాలు అందుకున్నారు.విజయవాడలో గురువారం రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన వీరు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు.వీరితో పాటు సహాయకులు, అధికారులు 3368మంది జిల్లానుంచి హాజరయ్యారు.

భారతీయ జ్ఞాన పరంపరను కాపాడుకోవాలి

● సంస్కృత వర్సిటీ ఛాన్సలర్ గోపాలస్వామి



ఐకేఎస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఛాన్సలర్ గోపాలస్వామి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతీయ జ్ఞాన పరంపరను కాపాడుకోవాలని జాతీయ సంస్కృత యూనివర్సిటీ ఛాన్సలర్ ఎన్. గోపాలస్వామి పేర్కొన్నారు. సంస్కృత యూనివర్సిటీలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టం (ఐకేఎస్) కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. గోపాలస్వామి మాట్లాడుతూ యూనివర్సిటీలో ఐకేఎస్ కేంద్రం ఏర్పాటు మంచి పరిణామమని తెలిపారు. సంస్కృతంలోని ఎన్నో విజ్ఞానదాయక అంశాలను ఈ కేంద్రం ద్వారా వెలుగులోకి తీసుకురావాలని కోరారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మాడగుల నాగఫణి శర్మ మాట్లాడుతూ అవధాన కళ విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పెంచుతుందన్నారు. దాని గురించి ఈ తరం తెలుసుకోవాలని కోరారు. ఐకేఎస్ కేంద్రం ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి వీసీ కృష్ణమూర్తి ధన్యవాదాలు తెలిపారు. ఐకేఎస్ నేషనల్ కోఆర్డినేటర్ సూర్యనారాయణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, డీన్ రజనీకాంత్‌శుక్లా, ప్రొఫెసర్ దక్షిణామూర్తిశర్మ పాల్గొన్నారు.



శరన్నవరాత్రుల అలంకరణలు

తిరుపతి: అన్నపూర్ణాదేవిగా తాతయ్యగుంట గంగమ్మ

చిల్లకూరు: మోహినీదేవిగా తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ

సూళ్లూరుపేట: అష్టకాళి అలంకారంలో చెంగాళమ్మ అమ్మవారు

శ్రీకాళహస్తి: ప్రత్యక్షం అవతారంలో జ్ఞానప్రసూనాంబ



వెంకన్నకు తాత తిరుమల నంబి


చిత్రం: శింగిరి మునెయ్య

తిరుమల శ్రీవేంకటేశ్వరుని భక్తాగ్రేసరుల్లో అగ్రగణ్యుడు తిరుమలనంబి. 10వ శతాబ్దంలో శ్రీరంగం నుంచి తిరుపతికి చేరుకున్న భక్తుడు ఈయన. శ్రీవారికి తీర్థకైంకర్యాలు ప్రారంభించిన వాడు. భగవద్రామానుజులకు మేనమామ, గురువు. తిరుమల క్షేత్రం సేవలోనే జీవితం గడిపినవాడు. సాక్షాత్తూ వెంకటేశ్వరుడిచే తాతా అని పిలిపించుకున్న భక్తుడు. తిరుమల ఆలయప్రాకార మాడవీధిలో తిరుమలనంబి సన్నిధి ఉంది. ఉత్సవాల్లో ఇక్కడ ఆగి హారతి తీసుకుని స్వామి ముందుకు కదులుతాడు. ప్రతిరోజూ ఉదయం తిరుమలలో శ్రీవారి పూజా కైంకర్యాలు ముగించుకుని తిరుమలనంబి అలిపిరికి చేరుకునే వారు. గోవిందరాజస్వామిని సేవించుకుని రామానుజాచార్యులు ఆదే సమయానికి అక్కడికి వచ్చేవారు. ఒక రాతిగుండు పక్కన చింతచెట్టుకింద రామాయణ ఉపదేశాలను మేనల్లుడైన రామానుజులుకి వినిపించే వారు. ఈ ఉపదేశాలను అనుగ్రహించి అలిపిరిలో శ్రీవారు తన పాదముద్రలు విడిచారట. అవే అలిపిరి శ్రీవారి పాదాలుగా నేటికీ భక్తుల పూజలందుకుంటున్నాయి.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.01 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,628

తలనీలాలు సమర్పించినవారు: 21,511

పద్మావతి అమ్మవారి సేవలో ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

తిరుచానూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని గురువారం మధ్యాహ్నం ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ స్వాగతం పలికారు. అర్చకులు మహాద్వారం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత రాధాకృష్ణన్ ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. పండితులు ఆయనకు వేదాశీర్వచనం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరీందర్ నాథ్, అమ్మవారి ఆలయన అధికారులు పాల్గొన్నారు.









కనువిందు చేసిన కళోత్సవం

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో గురువారంనాటి చిన్నశేష వాహన సేవలో కళా ప్రదర్శనలు కనువిందు చేశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 18 కళాబృందాల్లోని 430 మంది కళాకారులు తమ కళా విన్యాసాలతో అబ్బురపరిచారు. విశాఖపట్నం సునీత బృందం ప్రదర్శించిన గోవింద గానం నృత్యం వేంకటేశ్వరస్వామి వైభవాన్ని చాటింది. తెలంగాణకు చెందిన గౌరవిరెడ్డి బృందం కుంభ మయూర నృత్యం నెమళ్లు సంచరించిన అనుభవాన్ని కలిగించింది. మహారాష్ట్ర తరుణశేఖర్ జానపద బృందం ప్రదర్శనలో కళాకారుల భంగిమల్లో మెరుపు వేగం అబ్బురపరిచింది. కర్ణాటకకు చెందిన డాక్టర్ దర్శిని మంజునాథ్ బృందం శ్రీకృష్ణలీలా తరంగిణి నృత్యరూపకం ఆకర్షించింది. మండపేటకు చెందిన వీరవేణి బృందం కోలాటం, కడప జిల్లాకు చెందిన బాబు బృందం డ్రమ్ములయ విన్యాసాలు, విశాఖపట్నంకు చెందిన లక్ష్మీబృందం శ్రీకృష్ణ రసలీల రూపకం ఓలలాడించాయి. కేరళకు చెందిన అభిషేక్ బృందం కథకళి, పాండిచ్చేరికి చెందిన తిరుమురగన్ కరగట్టం ప్రదర్శించారు. డాక్టర్ ఉషారాణి ప్రదర్శించిన దేవేరుల చిన్న వాహన సేవ, మహారాష్ట్రకు చెందిన రాహుల్ హల్దే బృందం హోలీ నృత్యం, సీహెచ్ అజయ్ బృందం కూచిపూడి నృత్యం,శైలజా కుమారి బృందం భక్త ప్రహ్లాద రూపకం, అస్సాంకు చెందిన జోయ్‌దేవ్ దేకా బృందం బోర్తాల్ నృత్యం, ప్రసూన్ బెనర్జీ బృందం జుహ్మర్ నృత్యం నేత్రపర్వంగా సాగింది.

రాజు యోగ్ బృందం సన్షైన్ గొడుగుల నృత్యం, తూర్పుగోదావరి జిల్లా తణుకుకు చెందిన హారిక బృందం, తిరుమలకు చెందిన శ్రీనివాసులు కోలాట నృత్యాలతో తన్మయపరిచారు. రాత్రి హంస వాహన సేవలో కళాప్రదర్శనలు మంత్రముగ్ధుల్ని చేశాయి.







సి.గొల్లపల్లెలో వైద్యశిబిరం

తిరుపతిరూరల్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): సి.గొల్లపల్లెలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. దామినేడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుకన్య నేతృత్వంలో మధుమేహం, నోటిక్యాన్సర్, రొమ్ముక్యాన్సర్, అనీమియా, క్షయ పరీక్షలను నిర్వహించారు. గర్భిణులకు టీకాలు వేశారు. సర్పంచ్ విడుదల రవికుమార్‌రెడ్డి, కృష్ణప్రియ, ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్, సీహెచ్‌వో నళిని తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పని గంటల పెంపుపై నిరసన

చంద్రగిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పని గంటల పెంపుదలకు వ్యతిరేకంగా ఏపీ స్కీమ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీల ఆధ్వర్యంఖలో గురువార టవర్ క్లాక్ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ ఇన్‌చార్జ్ కేవై రాజా, సిపిఐ మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ కార్మికుల హక్కులు కాల రాస్తే సహించేది లేదన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోత్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన భూమిని కబ్జా చేశారనడం సరికాదు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎమ్మార్‌పల్లె సర్వే నెంబరు 303/1 శ్మశాన భూమిని కూటమి నాయకులు కబ్జా చేశారనడం సరికాదని తిరుపతి జనసేన 21వ వార్డు ఇన్‌ఛార్జి రంగారెడ్డి అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 2023లో శ్మశాన వాటిక ప్రహరీ గోడ కూలిందని, అప్పటి నుంచి పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ పరిశీలించి గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు. రెండు ఎకరాలకు పైగా ఉన్న శ్మశానవాటికలో ఎకరానికిపైగా వాగు పొరంబోకు స్థలం పేరుతో వైసీపీ నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. అధికారులు స్పందించి న్యాయం చేయకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రబాబు, కిరీటిరెడ్డి, గంగులయ్య, చంద్రమౌళి, దామోదర్, శ్రీనివాసులు, రాజశేఖరగౌడ్ పాల్గొన్నారు.

జైలు హెడ్ వార్డర్‌కు జాతీయ అవార్డు


వార్డర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి సబ్ జైలు హెడ్ వార్డర్ వై.సుధాకర్‌కు జాతీయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా జైలు సూపరింటెండెంట్ రామకృష్ణ యాదవ్, డిప్యూటీ జైలర్ శ్రీకాంత్, సిబ్బంది గురువారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయిలో ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు తెలంగాణా పోలీసు అకాడమీలో జరిగిన ఏడవ జాతీయ స్థాయి ప్రిజన్స్ డ్యూటీ మీట్‌లో షార్ట్‌పుట్‌లో ఆయన మూడవ ర్యాంకు సాధించి, రజత పతకం అందుకున్నారు.

సీహెచ్‌సీ అంబులెన్స్ మరమ్మతులకు ఓకే


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సుధారెడ్డి

చంద్రగిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీహెచ్‌సీలో పాడైన అంబులెన్స్‌కు మరమ్మతులు చేపట్టేందుకు, డ్రైవరుకు వేతనం ఇవ్వడానికి టీడీపీ మహిళానేత పులివర్తి సుధారెడ్డి అంగీకరించారు. గురువారం ఆస్పత్రిలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా తన దృష్టికి వచ్చిన అంబులెన్స్ సమస్యను వెంటనే పరిష్కరించారు. ఐసీడీఎస్ పౌష్టికాహార స్టాల్స్‌ను కూడా సుధారెడ్డి ప్రారంభించి గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.. సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, వైద్యులు కుసుమ, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత

రామచంద్రాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల సందర్భంగా స్వచ్ఛతే హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడి ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్‌వైజర్ మణిలా ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు ఇందులో పాల్గొన్నారు.

రేపటి నుంచి శిల్పారామంలో దసరా సంబరాలు

తిరుచానూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో శనివారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఏవో సుధాకర్ తెలిపారు. గురువారం శిల్పారామంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాలను పురస్కరించుకుని రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రముఖ కళాకారులు శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు ప్రదర్శిస్తారన్నారు.ఈ వేడుకల్లో పాల్గొనాలని ప్రజలను కోరారు.

పోలీసుల అదుపులో దాడి కేసు నిందితులు

తిరుచానూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక నేతాజీరోడ్డుకు చెందిన డిగ్రీ విద్యార్థి దినేష్‌పై హత్యాయత్నానికి పాల్పడిన వారిని పోలీసులు సీసీ పుటేజీ ద్వారా గుర్తించారు. బుధవారం కత్తులు, బీరు బాటిళ్లతో దాడి చేసిన కుహల్, గుణ, సుజిత్, సునీల్, సాయితో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దాడిలో గంజాయి ముఠా కూడా ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు.

రేపు జాబ్‌మేళా

తిరుపతి రూరల్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీ విజయనగర్‌కాలనీ ఇంజినీర్స్ లేఅవుట్‌లోని డాక్టర్ ఆర్‌సీరెడ్డి డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ)ఆధ్వర్యంలో శనివారం ఉదయం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ పి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ విద్యార్హత ఉన్న వారు అర్హులని, హెచ్‌టీటీపీఎ్‌స://నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్/యూజర్ లింకులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉందన్నారు. 11 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. వివరాలకు 7013509543, 9988853335 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పరకామణి అక్రమాలపై సీఎంకు నివేదిక సమర్పించిన భానుప్రకాష్‌రెడ్డి


నివేదికను పరిశీలిస్తున్న చంద్రబాబు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పరకామణిలో జరిగిన అక్రమాలక సంబంధించి పూర్తి నివేదికను సీఎం చంద్రబాబునాయుడికి టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి గురువారం అందజేశారు. తిరుమలలో ముఖ్యమంత్రిని కలిసి పరకామణిలో అక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా నివేదికను సీఎం పరిశీలించి భానుప్రకాష్‌ను మరిన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనను అభినందించారు.

ఆనంద రూపిణి..అభయప్రదాయిని

చంద్రగిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మూలస్థాన ఎల్లమ్మ గురువారం రాత్రి గజలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ఆలయ ఆవరణలో తీసుకొచ్చి పట్టుపీతాంబురాలు, బంగారు ఆభరణాలతో గజలక్ష్మి అలంకరణ చేసి వెండి గజ వాహనంపై అధిష్టించారు. అనంతరం అమ్మవారిని వెండి గజ వాహనంపై ఊరేగించారు. మిట్టమీద గంగమ్మను గజలక్ష్మి అలంకరణలో గజ వాహనంపై అదిష్టింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. మల్లేశ్వరాలయంలోని సంతోషిమాతకు అన్నపూర్ణదేవి దర్శనమిచ్చారు. తొండవాడ ఉగ్రప్రత్యంగిరాదేవికు తృతీయ దుర్గగా చంద్రఘంట అలంకరణ చేసి దర్శనం కల్పించారు. **తిరుపతి రూరల్**: తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీదేవి అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఉభయదారులుగా వైవీరమణప్ప, అలివేలు, ఎం.నాగరాజు, అనిత, పి.ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులు వ్యవహరించారు. వేణుగోపాల్‌నాయుడు, టీడీపీరూరల్‌మండల అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, నాయకులు కత్తి సుధాకర్, శీనివాసులు అమ్మవారిని దర్శించుకున్నారు. చెంచువారికాలనీలో మూలస్థాన యల్లమ్మ అన్నపూర్ణదేవి అలంకారంలో అనుగ్రహించారు. ఉభయదారులుగా భారతి, సురేష్‌బాబు దంపతులు, యశస్విని, లక్ష్మీ శ్రీకాంత్ వ్యవహరించారు. **పాకాల**: నేంద్రగుంటలోమూలస్థాన ఎల్లమ్మ కాత్యాయని అలంకరణలో దర్శనమిచ్చారు. **భాకరాపేట**: చిన్నగొట్టిగల్లు కట్టపై తిరుపతి గంగమ్మ రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు.


గజలక్ష్మి అలంకరణలో ఎల్లమ్మ - భువనేశ్వరి అలంకారంలో మరకతశక్తి కాళీ


రాజరాజేశ్వరిగా గంగమ్మ


గజలక్ష్మిగా మిట్టమీద గంగమ్మ- చంద్రఘంట అలంకరణలో ఉగ్రప్రత్యంగిరాదేవి- విశేషాలంకరణలో సంతోషిమాత-అన్నపూర్ణదేవిగా చాముండేశ్వరీదేవి(తుమ్మలగుంట)-అన్నపూర్ణగా మూలస్థాన యల్లమ్మ(తుమ్మలగుంట) - కాత్యాయనిగా నేంద్రగుంట ఎల్లమ్మ

సీఎం చంద్రబాబుకు వీడ్కోలు


వినతిపత్రాలు అందుకుంటున్న సీఎం చంద్రబాబు

తిరుచానూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల జిల్లా పర్యటనను ముగించుకుని గురువారం సీఎం చంద్రబాబు అమరావతికి తిరుగు పయనమయ్యారు. తిరుమల నుంచి రోడ్డు మార్గాన తిరుచానూరు తాజ్ హోటల్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రి నారా లోకేష్‌తో కలిసి అమరావతికి బయలుదేరారు. హెలిప్యాడ్ వద్ద డీఐజీ షిమోషి బాచ్‌పాయ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆదిమూలం, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు సుగుణమ్మ, నరసింహయాదవ్, టీడీపీ నేతలు శ్రీధర్‌వర్మ, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, బుల్లెట్ రమణ వీడ్కోలు పలికారు. అంతకుముందు పలువురు నేతల నుంచి సీఎం అర్జీలు స్వీకరించారు.

ఘనంగా ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం


రంగోళిలో పాల్గొన్న విద్యార్థులు

చంద్రగిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలోని ఎంబీ స్కూల్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో గురువారం ఘనంగా ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు రంగోలి, పోస్టర్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఔషధాల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంబీ స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ డీన్ మాట్లాడుతూ ఆధునిక ఆరోగ్య సంరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతగానో విస్తరిస్తోందన్నారు. కార్యక్రమాలకు సమన్వయం చేసిన విద్యార్థులను, అధ్యాపకులను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగరాజ్ రామారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సారథి అభినందించారు.

చిన్నశేషుడిపై శ్రీహరి చిద్విలాసం



తిరుపతి రూరల్, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. గురువారం స్వామివారు స్వామి కృష్ణుడి అలంకారంలో చిన్నశేష, హంసవాహనాలపై విహరించి భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు.

దీన దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

చంద్రగిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు కాకిమాను మునిరాజ ఆధ్వర్యంలో పండిత దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటముని మాట్లాడుతూ ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోదీఅంతోదయస్ఫూర్తితో అనేక అభివృద్ధి పథకాలను చేపట్టారన్నారు అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్రమణ్యా యాదవ్,మునిగంగిరెడ్డి, చంద్రబాబుయాదవ్, ఆర్ఎస్ఎస్ నాయకులు ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

తప్పిపోయారు.. అప్పగించారు

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన డిజిటల్ జియో ట్యాగ్స్ సత్ఫలితాలిస్తోంది. బ్రహ్మోత్సవాల్లో తొలి రోజున బుధవారం ఏడుగురు, రెండో రోజున ఐదుగురు వృద్ధులు, ముగ్గురు చిన్నారులు రద్దీలో తప్పిపోయారు. జియో ట్యాగ్స్ ద్వారా వారిని గుర్తించి పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు.

వైద్యరంగంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు

తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో ఫార్మాసిస్టుల పాత్ర ముఖ్యమైందని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు అన్నారు. ఎస్వీ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రవిప్రభు మాట్లాడుతూ రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో వైద్యుల తర్వాత ఫార్మాసిస్టుల సూచనలు ముఖ్యమన్నారు. మందులు ఇవ్వడమేగాక వాటిని ఎలా వాడాలో తెలిపేది వారేనన్నారు. రుయా సూపరింటెండెంట్ రాధ మాట్లాడుతూ ఫార్మాసిస్టులు వైద్యం అందించడమే కాకుండా వైద్య పరిశోధనల్లోనూ ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాదముని, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అరుణ్‌సెల్వకుమార్, సంఘం నేతలు నరేష్, కొండయ్య, గిరిధర్, రామకృష్ణ, చంద్రకళ పాల్గొన్నారు.

అధిక శబ్దాలే వినికిడి లోపాలకు కారణం


మాట్లాడుతున్న ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వినికిడి లోపం కొందరికి పుట్టుకతో వస్తే మరికొందరికి అధిక శబ్దాలు వినడం వల్ల వస్తాయని, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. స్విమ్స్ ఈఎన్‌టీ విభాగం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా 75-85 డిసిబెల్స్ శబ్దానికి గురైతే చెవిలోని కర్ణబేరి దెబ్బతిని వినికిడి లోపం వస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధిక శబ్దాలు వచ్చేటప్పుడు చెవులు మూసుకోవడం సురక్షితమన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలను ఎక్కువ శబ్దాలతో వినడం కూడా ప్రమాదకరమన్నారు. చెవిలో చిన్నపాటి సమస్య తలెత్తినా వైద్యులను సంప్రదించి తగిన వైద్యం పొందాలన్నారు. ఈఎన్‌టీ వైద్య విభాగాధిపతి ఎస్.బి.అమర్‌నాథ్, వైద్యులు భానుప్రదీప్, సాయిమౌర్య, ప్రత్యూష పాల్గొన్నారు.

భువనేశ్వరి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక డీబీఆర్ రోడ్డులో అయోధ్య రామ మందిరం నమూనాతో రూపొందించిన భువనేశ్వరి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. రామ మందిరం నమూనాను వీక్షించి అద్భుతంగా ఏర్పాటు చేశారని ఆయన నిర్వాహకులను అభినందించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా 200మంది కళాకారులతో ఈ సెట్ రూపొందించామన్నారు. రూ.100 ప్రవేశ రుసుం చెల్లించి రామ మందిర సెట్ సందర్శనతోపాటు షాపింగ్, నోరూరించే పలురకాల వంటకాలను రుచి చూడవచ్చునని తెలిపారు. 30కిపైగా అబ్బురపరిచే ఎమ్యూజ్‌మెంట్ రైడ్స్‌తోపాటు 100కుపైగా స్టాల్స్, ఎంటర్‌టైన్‌మెంట్ ఐటమ్స్ ఉన్నాయన్నారు. యువతను ఆకట్టుకునే దుస్తులు, గాజులు, హ్యాండీక్రాఫ్ట్ అందుబాటులో ఉంచామని వివరించారు. నగర, శివారు ప్రాంతాల ప్రజలు ఆదరించాలని కోరారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, శంకర్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, నరేంద్ర, సూరా సుధాకర్‌రెడ్డి, రాజారెడ్డి, చిన్నంగారి రమణ పాల్గొన్నారు.

ఘనంగా చిన్నంగారి రమణ జన్మదిన వేడుకలు


రమణ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎన్వీ ప్రసాద్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ జన్మదిన వేడుకలు స్థానిక వరద రాజనగర్‌లోని ఆయన నివాసంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సినీ నిర్మాత ఎన్వీ ప్రసాద్ హాజరుకాగా రమణ భారీ కేక్ కట్ చేశారు. అతిథులు మాట్లాడుతూ రమణ టీటీడీలో భక్తులకు, సిబ్బందికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీటీడీ ఉద్యోగ సంఘ నాయకులు విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, టీడీపీ నేతలు ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్, గంట భరత్, చిన్నంగారి సూరిబాబు, జీవన్‌కుమార్, పవన్‌తేజ్, నరసింహ, తంగవేలు, కార్పొరేటర్లు, అధికారులు, టీటీడీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నేతలు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా శంకర్ రెడ్డి జయంతి


అన్నదానం చేస్తున్న కందాటి సురేష్, మిథున్ రెడ్డి, జేడబ్ల్యూ విజయ్‌కుమార్ తదితరులు

తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి మున్సిపల్ మాజీ చైర్మన్ దివంగత డాక్టర్ కందాటి శంకర్ రెడ్డి జయంతి సందర్భంగా గురువారం రుయా ఆస్పత్రి వద్ద ఆయన అనుచరులు అన్నదానం చేశారు. కుటుంబ సభ్యులు కందాటి సురేష్‌రెడ్డి, కందాటి మిథున్‌రెడ్డి హాజరై పేదలకు అన్నదానం చేశారు. తిరుపతి అభివృద్ధిలో శంకర్ రెడ్డి చెరగని ముద్రవేశారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. టీడీపీ నగర మాజీ అధ్యక్షుడు జేడబ్ల్యూ విజయకుమార్, నాయకులు చల్లా దిలీప్ కుమార్, ప్రదీప్ కుమార్, మాజీ కౌన్సిలర్లు అమ్ములమ్మ, లలితమ్మ, లింగం రమేష్, దొడ్డారెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ప్రమీలమ్మ, పాతుగుంట గిరి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

'భూకబ్జా ఆరోపణలు అవాస్తవం'

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తమ భూమిని బాడుగకు తీసుకుని కబ్జా చేశారని తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన మల్లిశెట్టి లక్ష్మి చేసిన ఆరోపణలు అవాస్తవమని రామచంద్రాపురం మండలం కమ్మకండ్రిగకు చెందిన మహేశ్వర్‌నాయుడు అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి రూరల్ అవిలాల గ్రామపరిధిలోని సర్వే నెంబరు 13లో 1.15ఎకరాల భూమిని 2007లో కత్తి మమత నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, దీనికి సంబంధించిన రెవెన్యూ రికార్డులన్నీ తమ పేరుపైనే ఉన్నాయని తెలిపారు. మా భూమిని మేమే బాడుగకు తీసుకున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్‌నాయుడు సోదరులు విజయభాస్కర్, ద్వారకనాథ్ పాల్గొన్నారు.

స్కందమాతగా బొంతాలమ్మ



తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్కందమాత అలంకరణలో బొంతాలమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

పెన్షన్ సదుపాయం కల్పించాలి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎంటీఎస్ ఉపాధ్యాయుల సేవలను క్రమబద్ధీకరించి కనీస పింఛను సౌకర్యం కల్పించాలని 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు డిమాండ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా 98డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమావేశం గురువారం తిరుపతిలో నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. నాగరాజు మాట్లాడుతూ 25 ఏళ్లుగా చాలా ఇబ్బందులు పడ్డామని, చాలామంది రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్నామని, సాధారణ పెన్షన్ రూ.4 వేలు పొందడానికి అర్హత కోల్పోతున్నామని తెలిపారు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.


గాయత్రీదేవి అలంకరణలో వేశాలమ్మ, నడివీధి గంగమ్మ - తాతయ్యగుంట గంగమ్మ మూలవిరాట్టుకు అన్నపూర్ణాదేవి అలంకారం
లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో అన్నపూర్ణదేవి

అన్నపూర్ణాదేవి అలంకారంలో తాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మూలవిరాట్టుకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అన్నపూర్ణాదేవి అలంకరణ చేసి హారతులు సమర్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తికి అన్నపూర్ణాదేవి అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఊంజల్ సేవ అత్యంత వేడుకగా జరిగింది. కోర్టు సమీపంలోని వేశాలమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పెద్దగంగమ్మ, పాత మున్సిపల్ ఆఫీసు అనుకుని ఉండే నడివీధి గంగమ్మ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కపిలేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజల అనంతరం మావడిసేన అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు...

తిరుపతి అర్బన్, (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి ఆలయంలో గురువారం రాత్రి అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తవీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలోని మూలమూర్తి ఆదిపరాశక్తిగా, ఉత్సవమూర్తి చాముండేశ్వరి అలంకరణలో భక్తులను కటాక్షించారు. ఈ ఆలయాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి, నివేదన సమర్పించారు.


ఆదిపరాశక్తి అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరి

పరిసరాల శుభ్రతతోనే స్వచ్ఛ తిరుపతి


పద్మావతీ వర్సిటీలో పరిసరాలను శుభ్రం చేస్తున్న నేతలు, అధికారులు

తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల శుభ్రతతోనే స్వచ్ఛ తిరుపతి సాధ్యమని, ఆ దిశగా ప్రజలు అడుగులు వేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం మహిళా విశ్వ విద్యాలయం, ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో శ్రమదానం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని తెలిపారు. వ్యక్తిగత శుభ్రతతో పరిసరాల పరిశుభ్రతా అంతే ముఖ్యమన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఉమా, డిప్యూటీ కమిషనర్ అమరయ్య మాట్లాడుతూ ఇంటితోపాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 14 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అర్బన్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఊకా విజయ్‌కుమార్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రజనీ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.


తిరుమలలో గురువారం భక్తుల విడిది కేంద్రం వెంకటాద్రి నిలయం ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి పాల్గొన్న ఏపీజీబీసీ చైర్‌పర్సన్, టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

ఎస్పీబీ లేనిలోటు తీర్చలేనిది


బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సదాశివం తదితరులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : సినీ రంగంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం లేనిలోటు తీర్చలేనిదని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. బాలసుబ్రమణ్యం వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతి కోదండ రామాలయం దక్షిణ మాడవీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో గురువారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను సదాశివం గుర్తు చేశారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడి బాలు ఎన్నో పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు చిత్రపు హనుమంతరావు, కేఎన్‌రాజా, సుబ్రహ్మణ్యంరెడ్డి, హరినాథ్, పీఆర్ఎల్ కుమార్, హారిక, లీలావతి పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతికి ఎస్పీ వీడ్కోలు



తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని గురువారం తిరుగు ప్రయాణమైన ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు విమానాశ్రయంలో ఎస్పీ సుబ్బరాయుడు వీడ్కోలు పలికారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం కష్టపడి పనిచేస్తున్నారని రాధాకృష్ణన్ కొనియాడారు.

సమస్యల దోబీఘాట్


చెత్తాచెదారంతో నిండిపోయిన కాలువ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మధురానగర్‌కు సమీపంలోని దోబీఘాట్‌లో సమస్యలు కొలువై ఉన్నాయి. ప్రధానంగా బట్టలు ఉతికిన తర్వాత మురికి నీరు బయటకు వెళ్లే కాలువ దుస్థితికి చేరింది. చెత్తాచెదారం, మొక్కలు పేరుకుపోవడంతో నీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. ఇవి రోడ్డుపై రోజుల తరబడి నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమలు వ్యాప్తి చెంది చుట్టుపక్కల వారికి నిద్రలేకుండా చేస్తున్నాయి. తాగడానికి, బట్టలు శుభ్రం చేయడానికి అవసరమైన నీరు కూడా అందుబాటులో లేకపోవడంతో రజకులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై అధికారులకు, ప్రజాప్రతినిధు లకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కమిషనర్ మౌర్య దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్మికులు 13 గంటలు పనిచేసే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ నేతలు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పటిష్టంగా ఉన్న కార్మిక చట్టాలను సవరణ చేసి కార్పొరేటర్లకు అనుకూలంగా మారుస్తోందని, దానిపై రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో చట్టం చేయడం అన్యాయమని అన్నారు. ఈ చట్టాన్ని రద్దుచేసే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, మహేంద్ర, వెంకటేశులు, బాబు, కిషోర్, పద్మ, రాము, బాలాజీ పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా హరినాథరెడ్డి



తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా జిల్లాకు చెందిన పి.హరినాథరెడ్డి ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు చండీఘర్‌లో జరిగిన సీపీఐ 25వ జాతీయ మహాసభల్లో నూతన కౌన్సిల్ ఎన్నికలు జరిగాయి. రాష్ట్రం నుంచి ఏడుగురు ఎన్నికకాగా, జిల్లా నుంచి పి.హరినాథరెడ్డికి చోటు లభించింది. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి జాతీయ కౌన్సిల్‌లో స్థానం దక్కించుకోవడం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మిద్దె, పోషకాహార తోటలపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న రాస్ శాస్త్రవేత్త దివ్య

తిరుపతి (ఆటోనగర్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మిద్దె, పోషకాహార తోటలతో కలిగే ప్రయోజనాల గురించి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దివ్య రైతులకు అవగాహన కల్పించారు. తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థలు సంయుక్తంగా గురువారం షెడ్యూల్డ్ కులాల మహిళా రైతులకు శిక్షణ ప్రారంభించాయి. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయిలో మొక్కల పెంపకంపై దివ్య అవగాహన కల్పించారు. గృహ విజ్ఞాన శాస్త్రంలో చేపడుతున్న వృత్తి విద్యాశిక్షణ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.బిందు, డాక్టర్ ఎ.అరుణ, సుధ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ సెల్ఫ్ సపోర్టింగ్ సీట్లు భర్తీ చేయండి

ఎస్వీయూ వీసీకి టీఎన్ఎస్ఎఫ్ వినతి


వీసీ అప్పారావుకు విన్నవిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో సెల్ఫ్ సపోర్టింగ్ సీట్లు భర్తీ చేయాలని టీఎన్ఎస్ఎఫ్ ఎస్వీయూ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్ నాయుడు, గంగాధర్, మహిళా కన్వీనర్ కుసుమ కోరారు. ఈ మేరకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడికి గురువారం వినతిపత్రం అందజేశారు. మిగిలిపోయిన సీట్లకు వెంటనే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, తరుణ్ పాల్గొన్నారు.

ఘనంగా దీనదయాళ్ జయంతి



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు


తిరుపతి (ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు గురువారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. తాతయ్యగుంటలో దీనదయాళ్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులర్పించారు. ప్రధాన తపాలా కార్యాలయం వద్ద చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండాల గోపినాథ్‌రెడ్డి, కట్టమంచి చంద్రబాబు యాదవ్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రసాద్‌బాబు, విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.




పద్మావతి వర్సిటీలో దసరా వేడుకలు

ఆడిపాడిన వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంగీత, నృత్య విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని గాంధీ విగ్రహం ముందు సాయంత్రం ఈ వేడుకలు సాగాయి. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని విద్యార్థులు, ఉద్యోగులతో కలిసి ఆడిపాడారు. విద్యార్థులు, ఉద్యోగులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సంగీత, నృత్య విభాగ ప్రొఫెసర్లు శైలేశ్వరి, హిమబిందు పాల్గొన్నారు.



వెంకన్నకు తాత తిరుమల నంబి


చిత్రం: శింగిరి మునెయ్య

తిరుమల శ్రీవేంకటేశ్వరుని భక్తాగ్రేసరుల్లో అగ్రగణ్యుడు తిరుమలనంబి. 10వ శతాబ్దంలో శ్రీరంగం నుంచి తిరుపతికి చేరుకున్న భక్తుడు ఈయన. శ్రీవారికి తీర్థకైంకర్యాలు ప్రారంభించిన వాడు. భగవద్రామానుజులకు మేనమామ, గురువు. తిరుమల క్షేత్రం సేవలోనే జీవితం గడిపినవాడు. సాక్షాత్తూ వెంకటేశ్వరుడిచే తాతా అని పిలిపించుకున్న భక్తుడు. తిరుమల ఆలయప్రాకార మాడవీధిలో తిరుమలనంబి సన్నిధి ఉంది. ఉత్సవాల్లో ఇక్కడ ఆగి హారతి తీసుకుని స్వామి ముందుకు కదులుతాడు. ప్రతిరోజూ ఉదయం తిరుమలలో శ్రీవారి పూజా కైంకర్యాలు ముగించుకుని తిరుమలనంబి అలిపిరికి చేరుకునే వారు. గోవిందరాజస్వామిని సేవించుకుని రామానుజాచార్యులు ఆదే సమయానికి అక్కడికి వచ్చేవారు. ఒక రాతిగుండు పక్కన చింతచెట్టుకింద రామాయణ ఉపదేశాలను మేనల్లుడైన రామానుజులుకి వినిపించే వారు. ఈ ఉపదేశాలను అనుగ్రహించి అలిపిరిలో శ్రీవారు తన పాదముద్రలు విడిచారట. అవే అలిపిరి శ్రీవారి పాదాలుగా నేటికీ భక్తుల పూజలందుకుంటున్నాయి.





సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.01 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,628
తలనీలాలు సమర్పించినవారు: 21,511

పద్మావతి అమ్మవారిసేవలో ఉప రాష్ట్రపతి

తిరుచానూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని గురువారం మధ్యాహ్నం ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ దర్శించుకున్నారు.ఆలయం వద్ద ఆయనకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్ స్వాగతం పలికారు. అర్చకులు మహాద్వారం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత రాధాకృష్ణన్ ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. పండితులు ఆయనకు వేదాశీర్వచనం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే నాని, తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, అధికారులు పాల్గొన్నారు.


ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న సీపీ రాధాకృష్ణన్







కనువిందు చేసిన కళోత్సవం

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో గురువారంనాటి చిన్నశేష వాహన సేవలో కళా ప్రదర్శనలు కనువిందు చేశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 18 కళాబృందాల్లోని 430 మంది కళాకారులు తమ కళా విన్యాసాలతో అబ్బురపరిచారు. విశాఖపట్నం సునీత బృందం ప్రదర్శించిన గోవింద గానం నృత్యం వేంకటేశ్వరస్వామి వైభవాన్ని చాటింది. తెలంగాణకు చెందిన గౌరవిరెడ్డి బృందం కుంభ మయూర నృత్యం నెమళ్లు సంచరించిన అనుభవాన్ని కలిగించింది. మహారాష్ట్ర తరుణశేఖర్ జానపద బృందం ప్రదర్శనలో కళాకారుల భంగిమల్లో మెరుపు వేగం అబ్బురపరిచింది. కర్ణాటకకు చెందిన డాక్టర్ దర్శిని మంజునాథ్ బృందం శ్రీకృష్ణలీలా తరంగిణి నృత్యరూపకం అకర్షించింది. మండపేటకు చెందిన వీరవేణి బృందం కోలాటం, కడప జిల్లాకు చెందిన బాబు బృందం డ్రమ్ములయ విన్యాసాలు, విశాఖపట్నంకు చెందిన లక్ష్మీబృందం శ్రీకృష్ణ రసలీల రూపకం ఓలలాడించాయి. కేరళకు చెందిన అభిషేక్ బృందం కథకళి, పాండిచ్చేరికి చెందిన తిరుమురగన్ కరగట్టం ప్రదర్శించారు. తిరుపతి వెంకటేశ్వర సంగీత నృత్య కళాశాలకు చెందిన డాక్టర్ ఉషారాణి ప్రదర్శించిన దేవేరుల చిన్న వాహన సేవ, మహారాష్ట్రకు చెందిన రాహుల్ హల్దే బృందం హోలీ నృత్యం, సీహెచ్ అజయ్ బృందం కూచిపూడి నృత్యం,గూడూరుకు చెందిన శైలజా కుమారి బృందం భక్తప్రహ్లాద రూపకం, అస్సాంకు చెందిన జోయ్‌దేవ్ దేకా బృందం బోర్తాల్ నృత్యం, పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రసూన్ బెనర్జీ బృందం జుహ్మర్ నృత్యం నేత్రపర్వంగా సాగింది.త్రిపురకు చెందిన రాజు యోగ్ బృందం సన్షైన్ గొడుగుల నృత్యం, తూర్పుగోదావరి జిల్లా తణుకుకు చెందిన హారిక బృందం, తిరుమలకు చెందిన శ్రీనివాసులు కోలాట నృత్యాలతో తన్మయపరిచారు. వాహన సేవ కొనసాగుతున్నంత సేపు మహావీధుల్లో కళా ప్రదర్శనలు భక్తులను కనువిందు చేశాయి.





పుత్తూరు వార్తలు

క్యాంపస్ ఇంటర్వ్యూలో 32 మంది ఎంపిక


ఇంటర్వ్యూలో విజయం సాధించిన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

పుత్తూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 32 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన గ్లో లాజిక్స్ సొల్యూషన్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో 110 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు కంపెనీ హెచ్‌ఆర్, మేనేజర్ పూజ నగేష్, వైభవిలు నియామక పత్రాలను అందించారని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటప్రసాద్, ప్రిన్సిపాల్ మాణిక్యం, గోపి పాల్గొన్నారు.

అన్నపూర్ణదేవీగా ద్రౌపది అమ్మవారు


అన్నపూర్ణ దేవిగా ద్రౌపది దేవి అమ్మవారు


లక్ష్మీదేవి అలంకరణలో కామాక్షమ్మ

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పుత్తూరు పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ క్రిష్టప్ప మెదలి, మాజీ చైర్మన్ యుగంధర్, సభ్యులు మునిచంద్ర, దామోదరం, పురోహితులు మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సదాశివేశ్వరస్వామి ఆలయంలో కామాక్షమ్మ వారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దిలీప్, ఈవో విజయకృష్ణ సభ్యులు పార్థిబన్, శ్రీధర్, పూజిత, చిలకమ్మ పాల్గొన్నారు. రైల్వే క్వార్టర్స్‌లో వెలిసియున్న నాగాలమ్మ వైష్ణవి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎబ్బార్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వడమాలపేటలో....



వడమాలపేట,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. స్థానిక అంకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సీఎంకు వీడ్కోలు పలికిన విజయ్‌బాబు



పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమానికి విచ్చేసి, తిరిగి వెళుతున్న సీఎం చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు గురువారం తిరుపతిలోని తాజ్ హోటల్ వద్ద కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా వీడ్కోలు పలికారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు వృద్ధాప్య పింఛను ఇప్పించండి



పుత్తూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛన్ కంటే తక్కువ పెన్షన్‌తో దుర్భర జీవితాలను గడుపుతున్నామని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు నలభై ఏళ్ల శ్రమటోడ్చి ఆర్టీసీకి సేవలందించిన ఉద్యోగులు రూ.వెయ్యి నుంచి మూడు వేల రూపాయల పెన్షన్లతో జీవనం సాగిస్తున్నారని వాపోయారు. వృద్ధాప్యంలో వచ్చే జబ్బుల చికిత్సకు కూడా ఆ పింఛను సొమ్ము సరిపోవడం లేదని వాపోయారు. రాష్ట్రంలో తనలాంటి విశ్రాంత ఉద్యోగులు కేవలం ఇరవై వేల మంది మాత్రమే జీవించి వున్నారని తెలిపారు. సంక్షేమ ప్రభుత్వాన్ని నడిపే కూటమి పార్టీల నేతలు తమ దుస్థితిని గుర్తించి ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛన్లతో సమానంగా నాలుగు వేల రూపాయలను అందించాలని రామచంద్రారెడ్డి కోరారు.

శ్రీసిటీ-కొబెల్కో ఇండియా వార్షికోత్సవం


తాటి మొక్కలు నాటుతున్న మునియో తకహాషి, శ్రీసిటీ ఎండీ

సత్యవేడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీతో పాటు పులికాట్ పరిసరాల్లో 10వేల తాటి మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు జపాన్‌కు చెందిన కొబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (కేసీఈఐ) ప్రతినిధులు తెలిపారు. ఆర్‌డే ఫౌండేషన్‌తో కలిసి ఈ సామాజిక కార్యక్రమం చేపడుతున్నామన్నారు. శ్రీసిటీలోని కేసీఈఐ ప్లాంట్ 15వ వార్షికోత్సవ వేడుకలు గురువారం పరిశ్రమ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకహాషి, కాన్సుల్ నవోకో యుజావా, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కొబెల్కో ఆగ్నేసియా మేనేజింగ్ డైరెక్టర్ కసమోరి, కేసీఈఐ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో హయామా ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా కొబెల్కో ప్రాంగణంలో పలువురు ప్రముఖులు మొక్కలు నాటారు.

పని గంటల చట్టంపై నిరసన

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక శ్రమను దోపిడి చేసేందుకు పని గంటల పెంచారని, వెంటనే పెంచిన పని గంటల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కార్వేటినగరం కూడలి వద్ద నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గోపి, మహేష్, కైలాసం, భాస్కర్, వెంకటముని పాల్గొన్నారు.

నానో యూరియా, డీఏపీని విరివిగా వినియోగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ లక్ష్మీదేవి

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): నానో యూరియా, డీఏపీని విరివిగా వినియోగించాలని పుత్తూరు వ్యవసాయ ఉప సంచాలకులు లక్ష్మీదేవి తెలిపారు. రాష్ట్రీయ సేవా సమితి(రాస్) పుత్తూరు కార్యాలయంలో కృషి విజ్ఞాన కేంద్రం, ఏఆర్‌కేవీకే, మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏవో కోదండయ్య, మేనేజర్ రమేష్, రవి, మణి ప్రకాష్, శేఖర్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల కోసం లోక్ కల్యాణ మేళా

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లోక్ కల్యాణ్ మేళాకు శ్రీకారం చుట్టాయని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వీధి వ్యాపారుల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శుక్రవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు లోక్ కల్యాణ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ మేనేజర్‌లు, లేబర్, సివిల్ సప్లై, ఫుడ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్లు, ఐసీడీఎస్ నుంచి ప్రతినిధులు, టౌన్‌వెండింగ్ కమిటీ సభ్యులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. వీధి విక్రయదారులకు, కుటుంబ సభ్యులకు ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా హరినాథరెడ్డి



తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా జిల్లాకు చెందిన పి.హరినాథరెడ్డి ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు చండీఘర్‌లో జరిగిన సీపీఐ 25వ జాతీయ మహాసభల్లో నూతన కౌన్సిల్ ఎన్నికలు జరిగాయి. రాష్ట్రం నుంచి ఏడుగురు ఎన్నికకాగా, జిల్లా నుంచి పి.హరినాథరెడ్డికి చోటు లభించింది. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి జాతీయ కౌన్సిల్‌లో స్థానం దక్కించుకోవడం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వైద్యరంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు

తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో ఫార్మసిస్టుల పాత్ర ముఖ్యమైందని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు అన్నారు. ఎస్వీ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రవిప్రభు మాట్లాడుతూ రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో వైద్యుల తర్వాత ఫార్మసిస్టుల సూచనలు ముఖ్యమన్నారు. మందులు ఇవ్వడమే గాక వాటిని ఎలా వాడాలో తెలిపేది వారేనన్నారు. రుయా సూపరింటెండెంట్ రాధ మాట్లాడుతూ ఫార్మసిస్టులు వైద్యం అందించడమే కాకుండా వైద్య పరిశోధనల్లోనూ ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాదముని, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అరుణ్‌సెల్వకుమార్, సంఘం నేతలు నరేష్, కొండయ్య, గిరిధర్, రామకృష్ణ, చంద్రకళ పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతికి సాదర వీడ్కోలు


విమానాశ్రయంలో ఉప రాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతున్న మంత్రులు

రేణిగుంట, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు సాదర వీడ్కోలు లభించింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి దర్శనం అనంతరం గురువారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు సాదర వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

వృథాగా పోతున్న తాగునీరు


బుగ్గ వీధిలో పైపు లీకై వృథాగా పోతున్న తాగునీరు

రేణిగుంట సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీరు వృథాగా పోతుంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బుగ్గ వీధిలోని కరుమారియమ్మ ఆలయం ఎదురుగా ఉన్న పంచాయతీకి చెందిన వీధి కొళాయి ద్వారా నీరు వృథాగా పోతుంది. ఇప్పటికైనా పైపులైన్లకు మరమ్మతులు చేసి తాగునీరు వృథాగా పోకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పద్మావతి వర్సిటీలో దసరా వేడుకలు





తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంగీత, నృత్య విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీలో గాంధీ విగ్రహం ముందు సాయంత్రం ఈ వేడుకలు సాగాయి. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని విద్యార్థులు, ఉద్యోగులతో కలిసి కోలాటం వేశారు. విద్యార్థులు, ఉద్యోగులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సంగీత, నృత్య విభాగ ప్రొఫెసర్లు శైలేశ్వరి, హిమబిందు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో నారా బ్రాహ్మణి



నారా బ్రాహ్మణికి ముక్కంటి జ్ఞాపిక అందజేస్తున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ దర్శించుకున్నారు. ఆలయం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే ఆదిమూలం



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉండడమే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం వివిధ మండలాలకు చెందిన 9 మంది బాధితులకు రూ.5.11 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఇందులో భాగంగా పిచ్చాటూరు మండలం వెంగళత్తూరుకు చెందిన ఎన్.హరీష్ బాబుకు రూ.32,897, గోవర్ధనగిరికి చెందిన ఏ.వరలక్ష్మికి రూ.52,284, వరదయ్యపాళెంకు చెందిన రెడ్డి మాధవికి రూ.83,000, డి.నాగభూషణమ్మకు రూ.1,52,187, నాగలాపురం మండలం వేంబాకంకు చెందిన బి.మురళికి రూ.31,395, నాగలాపురంకు చెందిన జి.మనోహరన్‌కు రూ.27,348, నారాయణవనంకు చెందిన ఎస్.జానిమకు రూ.11,441, భీమునిచెరువుకు చెందిన డి.గణపతికి రూ.37,205, తుంబూరుకు చెందిన ఎన్.రాజన్‌కు రూ.83,362లు మొత్తం 9మంది బాధితులకు రూ.5,11,119 చెక్కుల రూపంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను కోరిన వెంటనే బాధితులను ఆదుకున్న ముఖ్యమంత్రి కార్యాలయానికి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ నేతలు మురళి, రమేష్, బాధితులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం



స్వర్ణముఖి నదిలో చెత్తను తొలగిస్తున్న బొజ్జల రిషితారెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. స్వచ్ఛతా హి సేవ-2025లో భాగంగా ఒక రోజు, ఒక గంట, ఒకసారి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణ మాడ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం స్వర్ణముఖి నదిలో వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో పురపాలకసంఘ కమిషనర్ భవానిప్రసాద్, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు కాసరం రమేష్, అస్మత్, డిల్లీబాబు, ఆర్ముగం, సుబ్బయ్య, షాకీరాలీ, ఎంఎస్ రెడ్డి, మునికృష్ణ, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, పురపాలకసంఘ సిబ్బంది, స్కౌట్ విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో ధాన్యాన్ని తినేసిన పశువులు

● లబోదిబోమంటున్న రైతులు



ధాన్యాన్ని తింటున్న పశువులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 25(ఆంధ్ర జ్యోతి): మండలంలోని సూళ్లూరుపేట రోడ్డు నీర్పాకోట గ్రామంలో ఉన్న మార్కెట్ యార్డులో ఆరపోసిన ధాన్యాన్ని గురువారం పశువులు తినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని మార్కెట్ యార్డులో నీర్పాకోట గ్రామానికి చెందిన రమణయ్య, మరి కొంతమంది రైతులు ధాన్యాన్ని ఆరపెట్టుకుంటున్నారు. గురువారం ఉదయం కొన్ని పశువుల గుంపు కూలిన గోడవైపు నుంచి మార్కెట్ యార్డులోకి ప్రవేశించి సుమారు పది బస్తాల ధాన్యాన్ని తినివేశాయని రైతులు తెలిపారు. మార్కెట్ సిబ్బంది నిర్లక్షంతోనే ధాన్యం పశువుల పాలైనట్లు రైతులు వాపోయారు.

ఒకేషనల్ కోర్సుతో భవిష్యత్తుకు పునాదులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ కోర్సుతో విద్యార్థులు భవిష్యత్తుకు సరైన పునాది వేసుకోవచ్చని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాలలో అమలు జరుగుతున్నఎలక్ట్రానిక్స్ ఒకేషనల్ కోర్సు దసరా సెలవుల్లోనూ పదవ తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎలక్ట్రానిక్ షాపుల్లో విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వస్తువుల పనితీరుపై ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ట్రైనర్ అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి, ఇంటర్ విద్యార్థినులకు సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమలో వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, డాక్టర్ ఉదయ్‌కుమార్, హెచ్‌ఎం రమణయ్య, హెల్త్ కేర్ ట్రైనర్ చంద్రకళ, వైద్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

డీఎస్సీ నియామకపత్రాలు అందించడం సువర్ణాధ్యాయం: టీడీపీ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ విజేతలకు నియామకపత్రాలు అందించడం ఓ సువర్ణాధ్యాయమని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంపదలోకెల్లా గొప్ప ఆస్తిగా చెప్పుకునే విద్య విలువ తెలిసిన వాడు సీఎం చంద్రబాబు అని చెప్పారు. మెగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి నారా లోకేష్‌తో కలిసి 15,941 మంది డీఎస్సీ విజేతలకు నియామకపత్రాలు అందజేయడం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, తంగేళ్లపాళెం పీఏసీఎస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, నాయకులు కోట చంద్రశేఖర్, మణి, గాజుల భగత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

పాహిమాం మాతా...

పాహిమాం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పాహిమాం మాతా... పాహిమాం అంటూ భక్తులు అమ్మవార్లకు మొక్కారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు గురువారం వివిధ రూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఎంతో శ్రద్ధతో ఉదయంనుంచే ఆలయాలకు వెళ్లి దీపారాధనలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తి అమ్మవారిని ప్రత్యక్షం అలంకారంలో అలంకరించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకంగా ధూపదీప నైవేద్యాలు సమర్పించి ఆలయంలో రంగులగోపురం వరకు ఊరేగించారు. అలాగే ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఉత్సవమూర్తి అమ్మవారు కూష్మాండదేవిగా కొలువుదీరారు. ఇదే ఆలయంలో వెలసిన కనకదుర్గమ్మ అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ మూలమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తిని వైష్ణవిదేవి అలంకారంలో, వేదాం గ్రామంలో దక్షిణకాళికాదేవి బాలాత్రిపుర సుందరిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరిదేవి మన్నారుగుడి రాజగోపాలస్వామి అలంకారంలో దర్శనమిచ్చారు. చంద్రఘంటాదేవిగా ఏడుగంగల అమ్మవారు, తెట్టు వద్ద గల నల్లగంగమ్మ, ముత్యాలమ్మ అమ్మవారు, బహదూరుపేటలోని కరుమారియమ్మ అన్నపూర్ణదేవిగా దర్శన భాగ్యం కల్పించారు. బీపీఅగ్రహారం చిన్నగంగమ్మ పొన్నాలమ్మ గౌరిదేవిగా, భాస్కరపేటలో వెలసిన ఛాముండేశ్వరి అమ్మవారు మధుర మీనాక్షి, బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి కైలాస మహాగౌరిదేవి అలంకారం, విశ్వ బ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మగుడివీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, పూసలవీధిగంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, పీవీరోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ● ఏర్పేడు: ఏర్పేడు మండలం చిందేపల్లిలో పార్వతీదేవి సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. గుడిమల్లం ఆలయంలో ఆనందవల్లి అమ్మవారు సంతానలక్ష్మి అవతరించి భక్తులకు దర్శనం కల్పించారు. ● నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధంగా ఉన్న అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు. అలాగే కైలాసనాథ కోనలోని కామాక్షి అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. ● నాగలాపురం: పల్లికొండేశ్వర ఆలయంలో మరగదాంబిక అమ్మవారు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ వాహన మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈవో లత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ● సత్యవేడు: పట్టణంలోని కళ్యాణ వీరభద్రస్వామి ఆలయంలో సర్వమంగళా దేవి అమ్మవారు కాత్యాయనీ దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త ఇందూరి రవికుమార్ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని బంగారు ఆభరణాలతో పాటు పసుపు కొమ్ములతో అందంగా అలంకరించి పూజాభిషేకాలు నిర్వహించారు. ● వరదయ్యపాళెం: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవిగా, అంబూరు పంచాయతీలో కామాక్షమ్మ అమ్మవారు కాత్యాయనీదేవిగా దర్శనమిచ్చారు.



బొమ్మల కొలువులో కూష్మాండదేవిగా జ్ఞానప్రసూనాంబ



అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ అమ్మవారు



మన్నారుగుడి రాజగోపాలస్వామిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



గౌరిదేవి అలంకారంలో పొన్నాలమ్మ



మధురమీనాక్షిగా చాముండేశ్వరి అమ్మవారు



చిందేపల్లిలో సంతానలక్ష్మి అలంకారంలో పార్వతీదేవి



సముదాయంలో అన్నపూర్ణ దేవిగా అవనాక్షమ్మ



కైలాసనాథ కోనలో అన్నపూర్ణ దేవి అలంకరణలో కామాక్షిదేవి



పల్లికొండేశ్వరాలయంలో అన్నపూర్ణగా మరగదాంబిక



సత్యవేడులో కాత్యాయని దేవీగా సర్వమంగళాదేవి

గురుదక్షిణామూర్తికి శాస్త్రోక్తంగా పూజలు



ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

● ఒకరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలాజీ

నాగలాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలంలోని బయ టకొడియంబేడు వద్ద పుత్తూరు - చెన్నై హైవేపై గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. కేవీబీపురం మండలం మారపరెడ్డి కండ్రిగకు చెందిన బాలాజీ, మౌర్యలు నాగలాపురం మండలం చిన్నాపట్టు గ్రామంలోని తన అత్తగారింటికి వచ్చి తిరిగి ఇద్దరూ ద్విచక్ర వాహనంపై నాగలాపురం వైపు వెళుతున్నారు. ఎదురుగా తిరుపతి నుంచి చెన్నై వైపు వెళుతున్న కారు వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలాజీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఎస్‌ఐ సునీల్ సంఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనం ద్వారా నగరి ఏరియా ఆస్పత్రికి గాయపడిన వారిని తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వధూవరులను ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న శంకర్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోట గ్రామంలోని టీడీపీ నాయకుడు మోహన్‌యాదవ్ కుమార్తె రాశిక, బాలసుబ్రమణ్యం నూతన వధూవరులను సత్యవేడు టీడీపీ ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి గురువారం ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటరీ ప్రధానకార్యదర్శి సతీష్‌రెడ్డి, నాయకులు రమణయ్య యాదవ్, మాజీ జడ్పీటీసీ వెంకటచలం, రమేష్, మునెయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వీధి కుక్కలకు వ్యాక్సినేషన్



వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ వేస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేణిగుంట, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): రేణిగుంట పట్టణంలో ఇటీవల వీధి కుక్కల గాట్లపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురించడంతో ఎట్టకేలకు పంచాయతీ అధికారులు స్పందించి వెటర్నరీ డాక్టర్ల సమన్వయంతో వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ ప్రారంభించారు. గురువారం ఉదయం పాంచాలినగర్‌లో వెటర్నరీ డాక్టర్ ఏడీ సునీత, పంచాయతీ కార్యదర్శి మాధవిలు సిబ్బందితో వీధి కుక్కలను పట్టించారు. అనంతరం వెటర్నరీ డాక్టర్లు వ్యాక్సినేషన్ అందజేశారు. కార్యక్రమంలో వెటర్నరీ, పంచాయతీ సిబ్బంది, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, పుష్పనాథం, సుబ్రహ్మణ్యం, నవాబు తదితరులు పాల్గొన్నారు.

దీనదయాళ్ సేవలు మరువలేనివి

కేవీబీపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సిద్ధాంతకర్త అంత్యోదయ స్ఫూర్తిదాత దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా కేవీబీపురంలో బీజేపీ మండల నాయకులు బాబుయాదవ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రసాద్, అజిత్‌కుమార్, డిల్లీబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం: టీడీపీ

ఏర్పేడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీ సమన్వయకర్తల సమావేశంలో మాట్లాడిన పద్ధతి తగదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఏర్పేడులో గురువారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలపై అనేక అక్రమకేసులు బనాయించి ఆ వర్గాలను ఇబ్బందులకు గురిచేసిన పరిస్థితులు మరచిపోయారా జగన్ అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, తాము కూడా డిజిటల్ బుక్‌ను ఓపెన్ చేస్తున్నట్లు జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిని టీడీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కృష్ణవేణి, కేవీ రమణ, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి

నారాయణవనం, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలం, తుంబూరు టీడీపీ నేత రాజన్ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం తుంబూరు చేరుకుని రాజన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును రాజన్ కుమారుడికి అందజేసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారతదేశానికి నష్టం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాలను జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే నష్టపోయేది దక్షిణ భారతదేశమే అని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆ పార్టీ మాజీ ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణమ్మ మీడియాతో మాట్లాడుతూ గతంలో బ్రిటీష్ వారు మన దేశాన్ని దోచుకున్నారని, ఇప్పటి నాయకులు ఉత్తర భారతదేశానికి దోచిపెడుతున్నారని ఆరోపించారు. దీంతో మన బిడ్డల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో అత్యధికంగా దక్షిణాది రాష్ట్రాలే చెల్లిస్తున్నాయని, అయితే మనకు తిరిగి పదో పరకో ఇస్తుందని చెప్పారు. ఇది చాలా ద్రోహమన్నారు. దీనిపై దక్షిణ భారత ప్రజలు, మేధావులు ఆలోచించాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో జంగాలపల్లి శుభాకరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



శివయ్య(పాతచిత్రం)

కేవీబీపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజూరుపాళెంలో విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు శివయ్య గురువారం ఉదయం తన పొలంలో వేసిన నారుమడికి నీరు పెట్టేందుకు ఇంటి వద్ద బోరు మోటారును ఆన్ చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కొట్టి పడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శివయ్యకు భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మదనంబేడులో వైద్య శిబిరం

సత్యవేడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంబేడులో గురువారం దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి క్రిస్టల్ దాస్ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. సీడీపీవో దేవకుమారి, ఎంపీహెచ్ఈవో సుబ్రమణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● పిచ్చాటూరు: మహిళల ఆరోగ్యంతో ఆ కుటుంబాలు రక్షణ కలిగి అభివృద్ధి దిశగా పయనిస్తాయని పిచ్చాటూరు పీహెచ్‌సీ డాక్టర్ ధనుష్ తెలిపారు. మండలంలోని రామగిరిలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాలపై జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ధనంజయలు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

కేవీబీపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో గురువారం స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి రజని రోగులను పరీక్షించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హేమలత, విజయశాంతి, రుద్ర, బాబుయాదవ్, నీలవేణి, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితానికి సైకిల్‌యాత్ర



ముత్తుసెల్వన్

రేణిగుంట, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): 11 లక్షల మొక్కలు నాటడమే తన లక్ష్యమని పర్యావరణ ప్రేమికుడు ముత్తుసెల్వన్ తెలిపారు. కోయంబత్తూర్‌కు చెందిన ఈయన 2021లో ర్యాలీ ఫర్ ఆక్సిజన్ అనే నినాదంతో ప్రారంభించిన ప్రపంచ దేశాల సైకిల్ యాత్ర బుధవారం రేణిగుంటకు చేరుకుంది. ఈ సందర్భంగా ముత్తుసెల్వన్ మీడియాతో మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలిని భావి తరాలకు అందించే బాధ్యత అందరిపై ఉందని ప్రచారం చేసేందుకు సైకిల్ యాత్ర చేపట్టానన్నారు. మూడేళ్లలో నేపాల్, బంగ్లాదేశ్ దేశాల్లో 45 వేల కిలోమీటర్ల యాత్ర పూర్తయిందన్నారు. మన దేశంలో యాత్ర పూర్తయ్యాక బర్మా, మయన్మార్, వియత్నాం, థాయిలాండ్, బ్యాంకింగ్ వెళ్తానన్నారు. యాత్రలో 8.25లక్షల మొక్కలు నాటానన్నారు. ఇప్పటికే వరల్డ్ గిన్నిస్ రికార్డ్ బుక్‌లో నమోదయ్యానని వివరించారు.

సత్యవేడు సమస్యలపై వినతి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న శంకర్‌రెడ్డి

సత్యవేడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి కలిసి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. తిరుమల పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన చంద్రబాబును తిరుపతి తాజ్‌హోటల్ సమీపంలోని హెలిప్యాడ్ వద్ద కలుసుకుని నియోజకవర్గంలోని పలు రహదారులు, వంతెనలు, కాజ్‌వేల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.

పనిగంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పనిగంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి తొండు మల్లికార్జున్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కత్తి రవి మాట్లాడుతూ శాసనసభ, శాసనమండలిలో పెంచిన పనిగంటల తీర్మానాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిచందు, మురళి, శివ, అంజి, పాండు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సుస్థిర జీవనోపాధుల కల్పనే లక్ష్యంగా వీఓఏలు, సీసీలు పనిచేయాలని వెలుగు ఏపీఎం మునెయ్య తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సీసీలు, వీఓఏలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, పయని, జీవ పాల్గొన్నారు.